# ఇల్లీగల్

దట్టమైన మబ్బు దొంతర్లోంచి దూసుకుపోతోన్న విమానం గాలికి అల్లల్లాడింది. జ్యూస్ గ్లాసులని ట్రేతో తీసుకువస్తున్న ఏర్‌హోస్టెస్ రేవతి తూలి ఓ ప్రయాణీకుడి ఒడిలో పడబోయి పడకుండా నిలదొక్కుకొని జ్యూస్ గ్లాసులు కిందపడకుండా బ్యాలన్స్ చేస్తూ చాలా కేర్‌ఫుల్‌గా ట్రేని పట్టుకొంది.

'ఎంత అనుభవం వున్నా గాలిలో ఈ విమానం ఆడే ఆటలకి, గుండెల్లోని వణుకూ, మనసులో జలదరింపూ అచ్చు ప్రేమలో పడ్డట్టుంది.' రేవతి మనసులో ఈ ఆలోచన మెరవగానే ఆమె అధరాలపై చిన్న నవ్వు తళుక్కుమంది.

ఇంతలో గాలి విమానంతో ఆటలు తగ్గించింది. రేవతి ప్రయాణీకులకి జ్యూస్ సర్వ్ చేసింది.

విమానం నేలపై దిగడానికి ఇంకా ఇరవై నిమిషాల సమయం వుంది.

రేవతి తోటి హోస్టెస్ ప్రియాజోషితో "లాండింగ్ అవ్వగానే నా పని పూర్తి చేసేసి వెంటనే వెళ్ళిపోతాను. ఈ

రోజు కారులో రాను. మిగిలిన వాళ్ళకి చెప్పు. నా కోసం ఎదురు చూడొద్దేం" అంది.

ప్రయాణీకులలో ఒకరు అడిగిన కాటన్ ఇవ్వటానికి వెళుతోన్న ప్రియా ఆగి 'ఏంటి విశేషం' అంటూ కొంటెగా నవ్వింది.

"విశేషమే" అంది రేవతి.

"ఏం విశేషమో చెప్పనా? శ్రీకాంతేగా" నవ్వుతూ అది ప్రియా.

"ఆ మరోటి కూడా"

"మరోటా? ఏంటి"

"గుర్తుచేసుకో" అంది రేవతి.

"ఇంకోటా" అంటూ కాటన్ పాసింజర్‌కి ఇచ్చి ప్రియా రేవతి దగ్గరికి తిరిగొచ్చి "నేనూ విశ్వనాథన్ పెళ్ళి చేసుకోకుండా మీలాగే ఉండాలనుకుంటున్నాం" అంది.

"అల్ ది బెస్ట్"

"థాంక్యూ" సంతోషంగా అంది ప్రియా.

కాటన్, వాటర్, జ్యూస్, చాక్‌లెట్స్, కాఫీ అడిగినవాళ్ళకి అడిగినవి ఇస్తూ అటూ ఇటూ ఏర్ హోస్టెస్ తిరుగుతోండగా పైలట్ లాండింగ్ అనౌన్స్ చేశాడు. అందరూ బెల్ట్ కట్టుకున్నారో లేదో ఒకసారి చెక్ చేసి ఏర్‌హోస్టెస్‌లంతా తమతమ సీట్లలో కూర్చున్నారు.

విమానచక్రాలు నేలని తాకినట్లు కూడా తెలియకుండా లాండింగ్ చేసిన పైలట్ చాకచక్యం కూడా రేవతి మనసుకి పట్టటం లేదు. పైలట్ డోర్ ఓపెన్ చేయటానికి ఇచ్చే సిగ్నెల్ కోసం ఎదురుచూస్తోంది రేవతి. ఏర్ క్రాఫ్ట్‌ని బాగా ల్యాండ్ చేసిన పైలట్స్ గురించి మెరిసేకళ్ళతో తన్మయంగా పదిమందితో చెప్పే రేవతి అంటే పైలట్స్‌కి అభిమానం. ఆ కళ్ళ మెరుపూ ఇష్టమే.

పైలట్ సిగ్నెల్ ఇవ్వగానే రేవతి డోర్ ఓపెన్ చేసింది.

గుమ్మం దగ్గర 'నమస్కారం' అంటూ చేతులు జోడించి నిలబడింది.

ఆఖరి ప్రయాణీకుడు ఆమెని దాటగానే జోడించిన ఆమె చేతులు విడిపోయాయి.

తను చెయ్యాల్సిన పని చేసేసి పైలట్‌కి 'బై' చెప్పేసి తన మేకప్ కిట్ తీసుకొని బయటికి రాబోతోంటే "నో కంగ్రాట్స్ ఫర్ మి ఫర్ కంఫర్టబుల్ ల్యాండింగ్" పైలట్ అడగ్గానే "సారీ సర్. ఇట్స్ వెరీవెరీ బ్యూటిఫుల్" అంటూ పైలట్‌కి షేక్ హాండ్ ఇచ్చి ప్రియాకి 'బై' చెప్పేసి నిచ్చెన దిగిపోయింది.

పరుగూ నడకా కాని రీతిలో వేగంగా ఎరైవల్స్ వేపు కదిలింది.

'హాయ్, హలో' ల ఎయిర్‌పోర్ట్ సిబ్బంది పలకరింపులకి అదే రీతిలో జవాబు చెప్పి ఎరైవల్స్ లాంజ్ దాటి బయటికి వచ్చింది. ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్‌లో డబ్బులు చెల్లించి రిసీట్ తీసుకొంది. చుట్టుముట్టిన డ్రైవర్లకి టాక్సీ నెంబర్ చెప్పింది. టాక్సీ వేపు ఆ డ్రైవర్ పరిగెత్తాడు. ఆ అరుపులు, రద్దీని చూస్తూ 'బాప్‌రే! రెండో జీవితం మొదలు' అనుకొంది. ఇంతకు ముందు ఆ విమానాశ్రయందాటే వరకు బతికిన వృత్తి లక్షణాలలోని ఏ లక్షణానికీ ఇప్పుడు అదే విలువ, అర్థం, గౌరవం వుండవ్.

చిరునవ్వు, పలకరింపు, చేతి స్పర్శ, వేయని పైట, వేసిన తలుపు ప్రశ్నార్థకా లవుతాయ్. ఈ స్థితి ఈ ఒక్క వుద్యోగంలోనే కాదు. ఏ వుద్యోగంలోనైనా ఇదే పరిస్థితి. వృత్తిపరిధి దాటి ఇంటి పరిధికి రాగానే జీవితం ప్రతివారికి జవాబు దారీయే. వృత్తిలో కొందరికే కదా వి ఆర్ రెస్పాన్సిబుల్.....రివ్వున చల్లగాలి తగలగానే రేవతి ఆలోచనల నుంచి తేరుకుంటూ బయటకి చూసింది.

టాక్సీ ఏర్‌పోర్ట్ ఆవరణ నుంచి బయటపడి రోడ్డు ఎక్కి పబ్లిక్ స్కూలు రోడ్డు మీద నుంచి ఫ్లయి ఓవర్ దాటి శ్రీనగర్ కాలనీ వైపు సాగిపోతోంది. 'ఎక్కడో వర్షం పడుతున్నట్టుంది' అనుకొంటూ కారు అద్దం పైకి ఎత్తేసింది. 'అరే! ఇక్కడ వర్షం మొదలైతే...తను రావటానికి వీలవుతుందా' రేవతి సందేహంలో కొట్టుమిట్టాడుతుండగానే టాక్సీ ట్వింకిల్ అపార్ట్‌మెంట్స్ ముందు ఆగింది. ప్రీపెయిడ్ టాక్సీ అయినా డ్రైవర్ చేతిలో అంతో ఇంతో పెట్టడం ఆనవాయితి. అతని చేతిలో ఓ పది పెట్టి లిఫ్ట్ వేపు కదిలింది. లిఫ్ట్ దగ్గర స్వామి కనిపించాడు.

స్వామి రేవతి కింది ఫ్లాట్‌లో వుంటున్నాడు. వ్యాపారస్తుడు. స్వామికి, అతని భార్యకి రేవతి రాకపోకలు గమనించడమే పెద్ద వ్యాపారం. వాళ్ళకే కాదు అక్కడ చాలామంది వ్యాపకం అదే. కాకపోతే స్వామికి కాస్త ఎక్కువ

కిక్కు ఇస్తుంది. భార్య చూడకుండా స్వామి చాలాసార్లు రేవతిని డిన్నర్‌కి రమ్మని ఆహ్వానించాడు. రేవతి రానని చెప్పింది. సినిమాకి పిలిచాడు. రానని ఇంకాస్త గట్టిగా చెప్పింది. ఒకసారి లిఫ్ట్‌లో వస్తూంటే మూడో వ్యక్తి లేకపోవటంతో స్వామి రేవతి చేయి పట్టుకున్నాడు. ఆ రోజు రేవతి స్వామిని దులిపిపారేసింది. మరోసారి తన జోలికి వస్తే 'మీ ఆవిడకి చెపుతానని' బెదిరించింది. అప్పట్నుంచి స్వామి రేవతిపై కక్ష కట్టినట్టే ప్రవర్తించసాగాడు. రేవతియే డిన్నర్‌కి పిలిచిందని, తను రానన్నానని భార్యకి ముందు జాగ్రత్తతో చెప్పాడు. అప్పట్నుంచి స్వామి భార్యకి రేవతి ఆలోచనలు నిద్రపోనివ్వటం లేదు. 'డ్యూటి అంటూ ఇల్లొదిలి బయటికి వెళ్ళిన రెండు మూడు రోజుల వరకూ ఇంటికి తిరిగి రాదు. ఇంటికి వాళ్ళూ వీళ్ళూ వచ్చిపోతుంటారు. ఇట్లాంటివాళ్ళ నుంచి అన్నీ ప్రమాదాలే' అని అపార్ట్‌మెంట్‌లో చాలామంది అనుకునేవాళ్ళు. రేవతిని ఎప్పుడో ఇల్లు ఖాళీ చేయించేసేవారే. ఆ ఇల్లేమో రేవతి సొంతం. రేవతిపై కక్ష తీర్చుకునే అవకాశంకోసం ఎదురుచూస్తున్నాడు స్వామి.

లిఫ్ట్ రావడానికి టైమ్ పడుతుందనీ, అదీకాక ఆ స్వామితో లిఫ్ట్‌లో ప్రయాణం చేయటం ఇష్టం లేక త్వరత్వరగా మూడు అంతస్తులు సునాయాసంగా ఎక్కేసింది రేవతి. తన ఫ్లాట్ తాళం తీసి లోపలికి వెళ్ళబోతోంటే 'మాకు మంచి నైబర్స్ లేరు' అని ముఖం మీదే అనేసే పక్క ఫ్లాట్ ఓనర్ అప్పుడే తలుపు తీసుకొని బయటకొచ్చింది. ఇంటికి వచ్చిన అతిథులని సాగనంపటానికి లిఫ్ట్ వేపు వెలుతూ పక్కనున్నవాళ్ళతో "మంచి నైబర్స్ లేకపోవటంతో భలే భయం వేస్తోందండి. పిల్లలున్న ఇల్లూ...." అంటూ గట్టిగా చెపుతుండటం రేవతి చెవుల్లో పడింది.

ఎప్పుడూ వినే మాటలే. ప్రతిసారీ మనసు చివుక్కుమనటం మామూలే. మొదట్లో గట్టిగానే జవాబు చెప్పేది. ఆ జవాబులు ఏవీ ఎవ్వరి ఆలోచనలనీ, మాటల్నీ మార్చలేకపోయాయి.

ప్చ్! సొంత ఇల్లూ, మంచి ఉద్యోగం వుండీ ఇన్ని మాటలు ఇంత హెరాస్మెంటూ అనుభవిస్తుంటే ఇవేం లేని ఒంటరి ఆడపిల్లలకి ఇంకెన్ని బాధలో! ఉద్యోగం వున్నా, ఇల్లు లేకపోతే ప్రతి క్షణం ఇంటి ఓనర్‌తో సహా ప్రతివారికీ నచ్చినట్టు బతకాలి. ఆ ఇల్లే 'కటకటాలు లేని పెద్దజైలు' అనుకొంటూ ఫ్లాట్‌లోకి వచ్చి తలుపు వేసి టైమ్ చూసింది. అతను

రావటానికి యింకా నలభై నిమిషాల సమయం వుంది. గీజర్ ఆన్ చేసింది. డ్యూటీ యూనిఫామ్ మిడి, టాప్ తీసేసి నైటీ వేసుకొని వ్యాక్యూమ్ క్లీనర్ ఆన్‌చేసి ఇంటిలోని కాస్త దుమ్ము దులిపేసింది. బెడ్ కవర్స్ మార్చింది. చల్లగానే వుంది కాని అవసరమైతే వుంటుందని కూలర్ నిండా నీళ్ళు పోసింది. డికాక్షన్ తీయటానికి ఫిల్టర్ వేసింది. షాంపుతో తలస్నానం చేసింది.

లేత గులాబిరంగు చీర. అదే రంగు జాకెట్టు వేసుకొంది. కాటుక దిద్దుకొని, బొట్టు పెట్టుకొంది. పెదవులకి లేత గులాబి రంగు లిపిస్టిక్, యూ షేప్ కట్ వున్న తన జుట్టుని అల్లుకొని చివర రబ్బర్ బ్యాండ్ పెట్టింది. ఫ్రిజ్ బాక్స్‌లో దాచిన జాజిపూలు తీసి పెట్టుకొంది.

బాల్కనీ తలుపు తీసి బయటికి వచ్చింది. గాలిలో పెరిగిన చల్లదనం. మాయమైపోయిన నక్షత్రాలు. చిన్న చినుకులు.

'బాప్‌రే!! వర్షం మొదలయిందే' అనుకొంటుండగా గాలి విసురుకి పవర్ పోయింది. చినుకులు ఎక్కువయ్యాయి. బాల్కనీలో జల్లు కొడుతోంటే ఇంట్లోకి వచ్చింది.

'అరే! తను వచ్చే టైమ్ అయింది. కరెంట్ లేదు. అంతా చీకటి. పవర్ పోయిందని తెలుస్తుందా? నిద్రపోయాననుకొని వెళ్ళిపోడు కదా చీకటి చూసి. అసలు వస్తాడా? తనకి వర్షంలో డ్రైవ్ చేయటం చాలా చికాకు' అనుకుంటూ క్యాండిల్ వెలిగించడానికి అగ్గిపెట్టె కోసం వంటింటి వేపు వెళుతూ ఒకసారి చూద్దామని బాల్కనీలోకి కాస్త తొంగి చూసింది. వర్షం జోరుగా పడుతోంది.

'తడిస్తే తడిచాను బాల్కనీలోనే నిలబడితే....మరి ఈ అలంకరణంతా కరిగి పోతుందేమో....ఎలా? ఏం చెయ్యాలి. ఇక్కడ నిలబడితే అతని రాక కనిపిస్తుంది. రాగానే కిందకి వెళ్ళొచ్చు. పోనీ ఇప్పుడే కిందకి వెళ్ళి నిలబడితే? ఇప్పటికే ఎన్నో మాటలు. కింద నిలబడటం చేస్తే ఇంకెన్ని మాటలు అంటారో. కరెంట్ వస్తే బాగుండును. ఈ గాలివాన తగ్గితే కాని కరెంట్ రాదేమో. ఏ ట్రాన్స్‌ఫార్మర్ పాడై పోయిందో! ఇంకా రాడేం'- ఆందోళన, ఆత్రుత ఆమెని సరిగ్గా నిలవనీయడం లేదు.

ఆమె లోపలికి రాబోతోంటే, వీధిలో ఫ్లడ్ లైట్ల వెలుగు. అతని కారే...వాచ్‌మాన్ గేటు తీస్తున్న చప్పుడు.

ఆ చీకట్లోంచి రేవతి ఒక్క వుదుటున బయటికి వచ్చి తలుపు తీసి మెట్లవేపు కదిలింది. రేవతి రెండు అంతస్తులు దిగేసరికి అతను కారు పార్క్ చేసి మెట్లు ఎక్కుతున్నాడు. బూట్ల చప్పుడు. రేవతి దిగటం ఆపి మెట్లవారగా గోడకి అతుక్కు పోయినట్టు నిలబడిపోయింది.

సరిగ్గా ఆమె నిలబడిన చోటే అతను ఆగి లైటర్ ఆమె ముఖం ముందు చప్పున వెలిగించాడు. లేత వెలుగులో తెల్లగులాబి లాంటి వదనం. అదురుతోన్న అధరాలు. లైటర్ ఆగిపోయింది.

"ఎలా తెలుసు" పెదవుల తడి ఆరిపోతోండగా అడిగింది.

జాజిపూలపై చెయ్యి వేసి ఒక్క క్షణం తరువాత ఆమె ముక్కుకి దగ్గరగా చెయ్యి వుంచి ముందుకి కదిలాడు.

పచ్చని పరిమళం - పూల పరిమళం.

ఆమె గుండె ఝల్లుమంది.

ఇద్దరూ ఇంట్లోకి వచ్చారు.

"కాఫీ తాగుదామా" క్యాండిల్ వెలిగిస్తూ అడిగింది.

"ఆ" అంటూ ఆమెని దగ్గరికి తీసుకొని నుదుటిపై ముద్దుపెట్టి "మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అంటూ తను తీసుకొచ్చిన బొకే అందించాడు.

"థాంక్యూ" అంటూ అతని బుగ్గపై ముద్దుపెట్టి అందమైన సజ్జలో ఆర్చిలా అమర్చిన గులాబి లిల్లీల వేపు చూస్తూ "తెల్లగులాబీలు భలే వుంటాయేం" అంటూ ఆ సజ్జని కార్నర్ స్టాండ్‌పై పెట్టింది.

వంట గదిలోకి వెళ్ళి పాలగిన్నె స్టవ్‌పై పెడుతూ "మీ ఐ.ఏ. పైలట్స్ స్ట్రయిక్ కాదు కానీ మా ఫ్లయిట్స్ అన్నీ ఫుల్ రష్! ఆ వెయిటింగ్ లిస్ట్‌ని చూస్తే బాలు, మరో నాలుగు ట్రిప్స్ వేసేద్దాం అంటారు మావాళ్ళు. టూ ట్రిప్స్‌కే స్పేస్ ప్రాబ్లమ్. స్కై స్పేస్ లేక ఈ రోజు మా ఫ్లయిట్ లేట్. అరె బాప్‌రే! టైమ్‌కి ఇంటికి రాగలనా లేదా అని కాస్త ఆందోళన పడ్డాను. ప్రియావాళ్ళకోసం కూడా ఆగలేదు. టాక్సీలో వచ్చేసాను. మీ విమానాలేం తిరగటం లేదుగా. మీ ఇంజనీర్స్‌కి పనేం వుంటుంది. రోజంతా ఏం చేస్తున్నావ్" అడిగింది రేవతి.

"పైలట్స్ స్ట్రయిక్ అయితే మాకేం పని ఉండదా ఏంటి?" అంటూ

ఆమె పయిటని చేతివేళ్ళకి చుడుతూ "రేపు ఏ డ్యూటీ" అడిగాడు.

"అఫ్. ఈరోజు ఇద్దరు పాసింజర్స్ తెగ విసిగించారనుకో. అవీ ఇవీ కావాలని సతాయించారు. ఇంటికి వచ్చేసరికి స్వామి ఎదురయ్యాడు. వాడితో ఈ రోజు గొడవపడే ఓపిక లేక మెట్లన్నీ ఎక్కి వచ్చాను. లిఫ్ట్ రావటానికి టైమ్ పడుతుందని అనుకున్నాననుకో" అంటూ అతనికి కప్పు అందించింది.

కప్పు అందుకొంటూ "థాంక్యూ" అని ఒక గుక్క తాగి "రేపు రవీంద్రభారతిలో బాలసరస్వతిగారి ప్రోగ్రాం వుంది వెళదామా" అడిగాడు.

"వెళదాం. రాడికల్ ఫెమినిజమ్ మీద ప్రియా వ్యాసం రాసింది. చాలా బావుంది. జిరాక్స్ కాపీ తెచ్చాను చదువు" రేవతి అంటూండగా పవర్ వచ్చింది.

"ప్రియా రీసెంట్ పోయెం చాలా పవర్‌ఫుల్‌గా రాసింది చదివావా" అడిగాడు శ్రీకాంత్ క్యాండిల్ ఆర్పుతూ.

"ఆ. విశ్వనాథ్‌కి చాలా నచ్చిందట. ఇంటికి కాస్త త్వరగా వస్తే వంట చెయ్యాలనుకున్నాను. కాని ఆలస్యం అయింది. బయటికి డిన్నర్‌కి వెళ్ళాలన్నా వర్షం పడుతోంది. ఏం చేద్దాం" అడిగింది రేవతి.

"ఎంతసేపూ....వంట చేసేసుకుందాం" అన్నాడు శ్రీకాంత్.

రేవతి కుక్కర్ పెట్టింది. వంకాయ కూర చేసి రసంపై మూత పెడుతున్న రేవతితో "నీ పని అయిపోయాక నువ్వు అలా కూర్చుని కబుర్లు చెపుతుండు. నే పాయసం చేస్తాను. బర్త్‌డే బేబీకి స్పెషల్" అన్నాడు శ్రీకాంత్.

"పాయసమా....ప్రియాకి ఇష్టం. కాస్త ఎక్కువ చెయ్. నువ్వు వెళ్ళేదారిలోనేగా ప్రియా ఇల్లు. వెళుతూ ఇచ్చేయ్" అంది రేవతి.

"ప్రియాని డిన్నర్‌కి రమ్మనలేదా"

"తనకి నా పుట్టినరోజనే గుర్తు లేదు. ఆకాశంలో ఉండగా ఈ టాపిక్ వచ్చి మధ్యలోనే కట్ అయిపోయింది" అంది రేవతి.

శ్రీకాంత్ పాయసం చేయటం పూర్తవగానే హాల్లోకి వచ్చారిద్దరూ. బొకేలోని లిల్లీల పరిమళం పల్చగా హాలంతా పరుచుకుంటోంది. రేవతి టి.వి. ఆన్‌చేసి వచ్చి అతని పక్కన కూర్చుంది. శ్రీకాంత్ టి.వి. వాల్యూమ్

పూర్తిగా తగ్గించాడు. ఆ బెడ్ ల్యాంప్ వేసి ట్యూబ్‌లైట్ తీసేసి "ఏదైనా పాడు" అడిగాడు.

కూర్చున్న చోటే అతని భుజంపై తలవాల్చి "సోజా రాజకుమారి... సైగల్ స్టయిల్లో పాడనా నా స్టయిల్లో పాడనా" అని అడిగింది.

"లత స్టయిల్లో పాడు"

రేవతి రెండు చరణాలు పాడి "పోమ్మా. నే పాడను. ఇది నువ్వు పాడాల్సిన పాట" అంది బుంగమూతి పెట్టి.

"తర్వాత పాడతాలే. ఇంకో పాట పాడు" అన్నాడు ఆమె చెవి జుంకా చూపుడు వేలితో ఆడిస్తూ.

"ముకాబులా...ముకాబులా.....ఓ లైలా..." అంటూ నవ్వి "తుపాకి లోడ్ చేసి గురిపెట్టి కాల్చిన హృదయాలు గాయపడునా..."

"అన్యాయం. ఆపాపు. సోజా రాజకుమారి ఏ స్టయిల్లో పాడినా భరించాను. ఈ పాట ఇలా పాడితే ఎలా" అంటూ ఆమె నోటికి అరచేయి అడ్డుపెట్టాడు.

"కౌబాయ్ కన్నుకొడితే ప్లేబాయ్ చేయిపడితే..." అతని చేతిని తప్పించుకుంటూ అల్లరిగా నవ్వుతూ పాడింది.

"ఊ తర్వాత" వస్తున్న నవ్వుని ఆపుకొంటూ అడిగాడు శ్రీకాంత్.

భుజాలు ఎగరేస్తూ కన్నుకొట్టి నవ్వుతూ బెడ్‌రూమ్ వేపు అతనికి అందకుండా పారిపోయింది. ఆమె వెనకే వెళ్ళి నవ్వుతున్న ఆమెని దగ్గరికి తీసుకున్నాడు. సర్వేంద్రియాలను సమ్మోహపరిచే అతని స్పర్శలో లీనమవుతూ అతనికి దగ్గరగా జరిగింది. యమునా తరంగాలపై నుంచి తేలివచ్చే రాసలీల మోహపు పవనాల శీతలత్వం లాంటి అనుభవం.

కాలింగ్ బెల్ మోత.

ఒళ్ళెరగని పారవశ్యం నుంచి పూర్తిగా కోలుకోకుండానే రేవతి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పోలీసులు.

"యూ ఆర్ అండర్ అరెస్ట్" పోలీసుల్లోంచి వినిపించింది.

ఆక్షణాన ఆమె పడిన ఉలికిపాటు దిగంతాలదాకా వినిపించి వుంటుంది.

"ఎం....దుకు"

"ప్రాస్టిట్యూషన్. ఎస్.ఐ.టి.యాక్ట్ కింద. నడవండి. స్టేషన్‌లో మాట్లాడుకుందాం" కాస్త విసుగ్గా అంటూ ఆమెకి అరక్షణం వ్యవధి కూడా ఇవ్వకుండా దాదాపు ఈడ్చుకువెళ్ళినంత హడావుడిగా రఫ్‌గా కిందకి తీసుకువెళ్ళి వ్యాన్‌లోకి తోసేస్తున్నప్పుడు అర సెకను పాటు కళ్ళు ఎత్తి పైకి చూసిన రేవతికి బాల్కనీలో స్వామి, పక్క ఫ్లాట్‌లో అస్పష్టంగా మనుష్యులూ కనిపించారు.

వ్యాన్ కదిలిపోయింది.

బయటికి వెళ్ళిన రేవతి ఎంతసేపైనా తిరిగి రాకపోయేసరికి శ్రీకాంత్ హాల్లోకి తొంగిచూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. వంటింట్లోకి వెళ్ళాడు. వండిన వంట తప్ప రేవతి లేదు. కారిడార్‌లోకి వచ్చాడు. నలుగురైదుగురు గుంపుగా మాట్లాడుకుంటున్నారు. శ్రీకాంత్‌ని చూడగానే మాటలు ఆపేశారు. గబగబా వాళ్ళంతా విడిపోయి ఎవరి ఇళ్ళల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళచూపుల్లో తేడా తోచింది. కానీ పరిస్థితి తెలియని శ్రీకాంత్ 'ఎక్కడికి వెళ్ళిందా' అనుకొంటూ 'బెల్ కొట్టారు కదా! వచ్చిన వాళ్ళు వెళ్తుంటే కిందవరకూ వెళ్ళుంటుంది, అనుకొని లోపలికొచ్చాడు. రేవతి వచ్చేలోగా డైనింగ్ టేబిల్‌పై అన్నీ సిద్ధం చేద్దామని ప్లేట్స్ పెట్టి మంచినీళ్ళు గ్లాసులో పోసాడు. గ్రీన్ సలాడ్ కోసం క్యారెట్, కుకుంబర్, టమాటాలు, బీట్‌రూట్, ఉల్లిపాయలు అందంగా కట్‌చేసి, నిమ్మకాయ చెక్కలు పల్చగా కట్ చేశాడు. అప్పటికీ రేవతి రాలేదు.

"ఏమయింది" అనుకొంటూ బయటికి వచ్చి తలుపువేసి లిఫ్ట్‌వేపు వెళ్ళాడు.

పక్క అపార్ట్‌మెంట్ వాచ్‌మాన్‌తో రేవతి విషయం మాట్లాడుతోన్న వాచ్‌మాన్ శ్రీకాంత్‌ని చూసి మాటలు ఆపి కాస్త కంగారు, ఆత్రుత నిండిన కళ్ళతో శ్రీకాంత్ వేపు రెండు అడుగులు వేశాడు.

"రేవతి మేడమ్ కిందకి వచ్చారా" హిందీలో అడిగాడు శ్రీకాంత్.

ఆ నేపాలీ ముసలి వాచ్‌మాన్ బిత్తరపోతూ అంతలోనే తేరుకొంటూ ఆశ్చర్యమూ, దిగులూ నిండిన స్వరంతో "పోలీసోళ్లు పట్టుకుపోయారు కదా. మీరు ఇంట్లోనే వున్నారుగా, తెలియదా" గబగబా అడిగాడు.

"పోలీసులా..."

"అవునండి."

"ఎందుకూ!? ఏ పోలీస్ స్టేషన్"

"తెలియదు"

వాచ్‌మాన్‌ని అడగటం అనవసరం. అతనికి ఏం తెలియదని నిశ్చయానికి వచ్చి అదురుతోన్న గుండెలతో కారు స్టార్ట్ చేశాడు శ్రీకాంత్.

◆◆◆

చెమ్మగా వున్న లాకప్‌రూమ్‌లో ఒంటరిగా కూర్చున్న రేవతి జీవకణాలన్నీ ప్రశ్నలతో, సందేహాలతో నిండిపోయాయి.

'కంప్లయింట్ ఎవరిచ్చారు' అంటే గౌరవనీయ కుటుంబాలవాళ్ళు అంటున్నారు. గుమ్మంలో మనిషిని గుమ్మంలో నుంచే తీసుకొచ్చేసారంటే దీని వెనక ఎవరున్నారో.... ఇంత కక్షా...తనపట్ల. ఆ ఫ్లాట్స్‌లో మనుష్యులకి వ్యతిరేకత వుందని తెలుసు. తనంటే తేలిక భావమూ వుందని చాలాకాలం క్రితమే తెలుసు. ఎంత అసహ్యం వున్నా ఇంతలా ప్రవర్తిస్తారా... మాట్లాడక పోవచ్చు....వినిపించేట్టు ఎవరి మీదో పెట్టి విసుర్లు విసరొచ్చు.... ఫంక్షన్స్‌కి పిలవకపోవచ్చు....కానీ ఇలా ఇంత కక్ష కట్టి శిక్షించాలను కుంటారా....అవును కక్షే. ఏ రోజైతే తను జీవమున్న జీవితం కోసం అన్వేషణ మొదలుపెట్టిందో ఆ రోజు నుంచే తను తన చుట్టుపక్కల కుటుంబాలవాళ్ళకి చేదు అయింది.

ఐదేళ్ళ క్రితం పెళ్ళి అవగానే ఇదే ఫ్లాట్‌కి తను సుందరంతో కలసి వచ్చింది. సుందరానికి కట్నం బాగా ఇచ్చారు. ఈ ఫ్లాటు తనకి అమ్మావాళ్ళు ఇచ్చారు. అప్పటికి తనకి పట్టుమని పద్దెనిమిదేళ్ళులేవు.

సుందరం మెడికల్ రిప్రజెంటేటివ్. అతనికి లేని వ్యసనాలు లేవు. ఎన్నో రాత్రులు తాగొచ్చి తన శరీరాన్ని హింసించేవాడు. అతనికి నచ్చిన ఇష్టమైన సినిమా తారల్లానో, అమ్మాయిల్లానో నటించమనేవాడు. ఆ అవతారాలన్నీ ఎత్తలేక సిగ్గుతో మనసు చచ్చిపోయేది. శరీరమూ బండబారిపోయేది. చెప్పినట్టు వినకపోతే తాగిన మైకంలో ఇంట్లోంచి బయటకి తోసేసి తలుపులు వేసేవాడు. ఫ్లాట్ అతని పేరు మీద మార్చమని అడిగేవాడు. ఈ గొడవలన్నీ చుట్టుపక్కల వాళ్ళకి అంతో ఇంతో తెలుసు. కానీ ఏ గోడవవల్ల సుందరాన్ని వదిలెయ్యాలని నిశ్చయించుకుందో ఆ

గొడవ కూడా ఆ ఫ్లాట్స్‌లో అందరికి తెలుసు.

సుందరం క్యాంప్స్‌కి వెళ్ళడం మామూలే. సుందరం ఆ రోజు క్యాంప్‌కి వెళ్ళి తిరిగి వచ్చేసరికి తను ఇంట్లో లేదు. పక్కవాళ్ళని అడిగితే సాయంత్రం బయటికి వెళ్ళిందని చెప్పారట. ఆ రాత్రి ఎనిమిది గంటలకి ఇంటికి రాగానే సుందరం గుమ్మం బయటే నిలబెట్టి ఎక్కడికి వెళ్ళావో చెప్పమన్నాడు. లోపలికి రానివ్వకుండా గుమ్మంలో నిలదీయడాన్ని షూటింగ్ చూస్తున్నంత ఆనందంగా, విచిత్రంగా, కుతూహలంగా చూస్తున్నారంతా. అప్పటికి అలాంటి చూపులని తట్టుకునే బలమైన మనసు లేదు. ముందు లోపలికి వెళితే తప్పా నిలబడలేననిపించింది.

"బ్రిటిష్ లైబ్రరీకి వెళ్ళాను, మెంబర్‌షిప్ డిటైల్స్ కనుక్కుందామని. అంతవరకూ వెళ్ళాను కదాని బిర్లామందిర్‌కి వెళ్ళాను'' అని చెపితే 'ఒక్కదానివీ బిర్లామందిర్‌కి వెళ్ళావంటే నేన్నమ్మాలా' అంటూ విరుచుకుపడ్డాడు.

తాగొచ్చినా...గుమ్మంలో నిలబెట్టి అరచినా అది న్యూసెన్సు అవ్వలేదు. 'పక్కవాళ్ళ విషయాలు మాకెందుకూ' అనే రీతిలో ఇటుపక్క ఎవ్వరూ తొంగి చూడలేదు. అలానే ప్రతి విషయంలోనూ ప్రవర్తించరేం... తను డైవోర్స్‌కి అప్లయ్ చేసినరోజు వాళ్ళనుంచే ఎంతో చీత్కారం....మొగుడిని వదిలేస్తానని కోర్టుకి వెళ్ళిందట! ఎన్నో మాటలు! ఎంతో గోల!

'ఎవడితోనో తిరిగొస్తే తప్పులేదు. కానీ మొగుడు అడిగితే తప్పొచ్చిందా' అంటూ మాటల మిసైల్స్.

ఆ పెళ్ళి, ఆ మొగుడు, ఆ జీవితం చీదరగా వుందని ఏడుస్తుంటే 'అదే జీవితం-అదే సౌభాగ్యం-ఆనందం' అన్నారు. ఈ రోజు ఇష్టమైన వ్యక్తితో పెళ్ళి ప్రసక్తి లేకుండా నచ్చిన రీతిలో జీవిస్తుంటే పరువు తక్కువా...ఇల్లీగల్ అంటున్నారు.

ప్రైవేట్ ఏర్‌లైన్స్‌లో ఏర్‌హోస్టెస్ ఉద్యోగానికి పెళ్ళి - విడాకులు ప్రతిబంధకాలు కాలేదు. తన కాన్వెంట్ చదువు, అందం, ఓర్పు, చాకచక్యం, ధైర్యం, చిరునవ్వు ఆ ఉద్యోగాన్ని ఇచ్చాయి.

గత ఏడాదిగా శ్రీకాంత్ పరిచయం. ఆ పరిచయం స్నేహంగా, ప్రేమగా పరిణతి చెంది గత మూడు నెలలుగా తామిద్దరూ వీలైనప్పుడల్లా

ఇక్కడో, శ్రీకాంత్ ఇంట్లోనో కలుసుకుంటున్నారు.

తమిద్దరి స్నేహం పనిచేసేచోట చాలామందికి తెలుసు. ఎవరి మనసుల్లో ఏముందో తెలియదు గానీ అంతా స్నేహంగానే వుంటారు. ఇల్లీగల్ అని ఎవ్వరూ అనలేదు.

ఒక వ్యక్తిని కలుసుకోవాలనుకోవడం కోసం నిరీక్షణ, ఆ నిరీక్షణలో ఎక్సైట్‌మెంటూ, చూసే సమయంలో ఆ మైమరపూ అసలు ఇంత రొమాంటిక్ ఫీలింగ్ ఆ వైవాహిక జీవితంలో ఏ రోజూ కలుగలేదు.

మనసూ శరీరమూ ఆనందపారవశ్యంతో గొప్ప శాంతితో ఓలలాడుతోంటే ప్రాస్టిట్యూషన్ అంటారేంటి.....

ఇనుప తలుపులు కిర్రుమని చప్పుడు.

"ఎస్.ఐ. రమ్మంటున్నారు"

రేవతి మెల్లగా వెళ్ళింది. ఎస్.ఐ. ఎదురుగా పాలిపోయిన కళ్ళతో శ్రీకాంత్, పక్కనే జ్వలిస్తున్న చూపులతో ప్రియా.

"థాంక్యూ" అని ఎస్.ఐ. తో చెప్పి "నడు వెళదాం" అన్నాడు శ్రీకాంత్. బాధగా వుంది అతని స్వరం.

రేవతి ఒక్క అడుగూ ముందుకు వేయలేదు.

"ఎలా వెళ్ళమన్నారు" రేవతి అడిగింది.

"చెప్తాను నడు"

"ఇప్పుడే చెప్పు"

శ్రీకాంత్ జవాబు చెప్పకుండా "రేవతీ వెళదాం. పంతం పట్టకు" అన్నాడు.

"చెప్పకపోతే రాను"

"పరువు గౌరవ మర్యాదలు గల కుటుంబాల మధ్య నువ్వు నివసిస్తూ, పెళ్ళి లేకుండా మగవాళ్ళతో వుంటున్నావని వాళ్ళ పరపతిని ఉపయోగించి నిన్ను అరెస్ట్ చేయించారు. నీమీద పెట్టింది తప్పుడు కేసు. కేవలం బెదిరించడం కోసం. మన పరపతిని ఉపయోగించి నిన్ను తీసుకెళ్తున్నాను" అన్నాడు శ్రీకాంత్.

"ఇంకా.....ఇంకా ఏమైనా చెప్పావా"

"ఆ.....మనం పెళ్ళి చేసుకోబోతున్నాం అని"

4565

"నో శ్రీకాంత్. నా గురించి వర్రీ అవ్వొద్దు. అరెస్ట్ అయ్యానుగా. కోర్టులో హాజరుపర్చనీ. నేనే తప్పూ చేయలేదు" అంటూ ప్రియా వేపు తిరిగి "ప్రియా, శ్రీకాంత్ చాలా అప్‌సెట్ అవుతున్నాడు. టేక్ కేర్ ఆఫ్ హిమ్" అంటూ లాకప్ వేపు నడిచింది.

శ్రీకాంత్ నిస్సహాయంగా ఆమె వేపు చూశాడు.

కోర్టు బోనులో నిలబడిన రేవతికి ప్రేక్షకుల గ్యాలరీలో శ్రీకాంత్, ప్రియాలతో పాటు మానవ జీవితాలు స్నేహం శాంతితో వికసించటానికి ఉపయోగపడే ఏ కొత్త జీవన విధానాన్ని అయినా కోరుకునే, ప్రోత్సహించే రచయితలు, విమెన్ ఆర్గనైజేషన్స్ వాళ్ళు, మానవ హక్కుల ప్రతినిధులు, ఎందరో యువతీ యువకులు, సానుభూతిపరులు కనిపించారు.

కేసు తాలూకు ఛార్జిషీటు మిగిలిన కాగితాలు రేవతికి యిచ్చారు.

అవి చదువుతుంటే రేవతికి అవి తన కేసుకి సంబంధించిన పేపర్సేనా అని అనుమానం వచ్చింది. తిరిగి పేరు వైపు చూసింది.

తన పేరే. కానీ తన కేసు కాదు.

పోలీసు స్టేషన్ నుంచి శ్రీకాంత్ రాగానే తను వెళ్ళి పోతుందను కున్నారు. అలా తను వెళ్ళకపోవడంతో విషయం కోర్టు వరకు వచ్చింది. కోర్టులో కేసు నిలవాలంటే నిజాలు రాస్తే కష్టం కదా! విషయాలన్నీ తారుమారు చేసి కోర్టుని నమ్మించేట్టు బలంగా కథ అల్లేసారు.

పోలీసులొచ్చి తలుపుకొట్టారట. తను తలుపు తీసిందట.

ఇంతవరకూ బానే వుంది. ఇక్కడనుంచే కట్టుకథ మొదలు!

తలుపు తీసేసరికి తన జుట్టు చెదిరి వుందట. వాళ్ళని చూడగానే ఇంట్లో వున్న ఓ పురుషుడు పారిపోయాడట. అతన్ని వెంబడించినా దొరకలేదట. తన ఇంట్లో బెడ్ రూమ్‌లో పరుపు కింద వెయ్యిరూపాయలు దొరికాయట. తనని ప్రశ్నిస్తే 'తను శరీరాన్ని అమ్ముకుంటానని, చాలా మంది పురుషులతో సంబంధాలున్నాయని వొప్పుకుందట'. భవిష్యత్తులో ఇలాంటి పనులు చేయనని, తనని వొదిలేయమని బ్రతిమిలాడుకుందట!

భలే కథ అల్లేసారు.

కోర్టు ప్రొసీడింగ్స్ ప్రారంభం అయ్యాయి. చాలా మామూలుగా

వాదనలు ప్రతివాదనలూ జరిగిపోతున్నాయి.

"గౌరవనీయమైన వృత్తిలో వుంటూ అగౌరవమైన పనులను గౌరవనీయమైన కుటుంబాల మధ్య నివసిస్తూ చేస్తున్నారు. మీమీద నేరం రుజువయ్యింది. మీకు జైలుశిక్ష విధించొచ్చు. లేదా ఫైన్ వేయొచ్చు. శిక్ష గురించి మీరేమైనా చెప్పుకుంటారా" అని అనగానే రేవతి గుండెల్లో ఆవేశం లావాలా పెల్లుబికింది.

"వాళ్ళు ఆరోపించినట్టు నాకు అనేక సంబంధాలు లేవు. డబ్బులకి శరీరాన్ని ఇవ్వటం అనేదే లేదు. పక్కవాళ్ళకో ఎదుటివాళ్ళకో నచ్చేట్టుగా వొంటరి స్త్రీ జీవితం లేకపోయేటప్పటికీ ఎవరికి తోచిన విధంగా వాళ్ళు దాడి చేస్తున్నారు. కేసులు పెడుతున్నారు. కానీ ఇలా ఎంతో కాలం అందరి ఆటలూ సాగే అవకాశం లేదు. బోల్డంత మంది అమ్మాయిలు సింగిల్ వుమెన్‌గా జీవిస్తున్నారు. వాళ్ళపై జరుగుతున్న దాడులను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటున్నారు. దాడిచేసిన వాళ్ళు అనేకసార్లు తలలు దించుకున్నారు. ఇంకా ఎంతో మంది సింగిల్ వుమన్‌గా కొనసాగబోతున్నారు. మేమంతా కలసికట్టుగా మా మీద దాడులని ఎదుర్కొంటాం. ఇప్పుడు నా కేసులోనూ అదే జరగబోతోంది.

మీకు తెలుసా! నాకు పెళ్ళయింది. విడాకులు తీసుకున్నాను. పెళ్ళిలో ఏ సౌఖ్యమూ, ఏ స్నేహమూ నాకు దొరకలేదు. నాకు ఓ వ్యక్తి పరిచయం అయ్యారు. ఆ స్నేహం గొప్పగా వుంది. తిరిగి పెళ్ళి అనే చట్రంలోకి వెళ్ళాలని లేదు. నా బతుకు నేను బతుకుతూ ఆ స్నేహాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇది చుట్టుపక్కలవాళ్ళకి ఏ విధంగా అసౌకర్యం? ఏ విధంగా ఇది అవినీతి? ఇది మరొకరి జీవితాలని ఎలా నాశనం చేస్తుంది? మీరే అన్నారుగా గౌరవప్రదమైన వృత్తిలో వున్నానని. బాగా పని చేస్తానని నాకు మంచి పేరు ఉంది. అక్కడ నన్ను అంతా గౌరవిస్తారు. మెచ్చుకుంటారు. స్నేహంగా వుంటారు. నా వృత్తి పట్ల నేనెంతో బాధ్యతగా వుంటాను. ఆర్థికంగా ఏ లోటూ లేదు. నాకు ఒక్కటే సందేహం. నాకు సామాజిక స్వేచ్ఛ వుందా లేదా....స్త్రీ, పురుష సంబంధాలలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. వాటికి అనుగుణంగా చట్టాలలో మార్పులు రావడం లేదు. మార్పులని రచయితలు తమ రచనలలో బలంగా చూపిస్తున్నారు. మిగిలిన మీడియా ఇంకా పతియే ప్రత్యక్ష దైవం అనే స్థాయిలో వుంది.

పుస్తకాలు అందరూ చదవరు కదా. అంతా చూసే మీడియా ఆ విధంగా వుంది. నాలాంటి వాళ్ళ జీవితాలు చుట్టుపక్కలవాళ్ళకి అర్థం కావటానికి చాలాకాలం పట్టవచ్చు. అంతవరకూ నాలా బతకాలనుకునేవాళ్ళ జీవితాలు మిగతా వాళ్ళకి హాస్యాస్పదంగానో, ఇల్లీగల్‌గానో తోచవచ్చు. చట్టాల్లో మార్పులు రానంతకాలం నాలాంటి వాళ్ళకి అరెస్ట్‌లు, బోనులూ తప్పవ్! థాంక్యూ" తీర్పు విన్న తర్వాత తాను చెప్పాలనుకున్నది చెప్పింది రేవతి.ఆవేశం లేని ఆమె ఆవేదన అక్కడున్నవాళ్ళందరిని ఆలోచనలో ముంచింది.

అంతా విని లా ప్రకారం జరిమానా కట్టమన్నారు. లేదా పదిహేను రోజుల జైలుశిక్ష అనుభవించాలన్నారు కోర్టువారు.

"జరిమానా కట్టను" అంది రేవతి.

రేవతి శిక్షని అనుభవించటం అన్న తలంపే శ్రీకాంత్ గుండెలని వణికిస్తోంది. ఆమెకి నచ్చచెప్పబోయి ఆమె పట్టుదల తెలిసిన అతను మౌనంగా వుండిపోయాడు.

"సమస్య బయటికి వచ్చిందిగా, చర్చించనీ అందరినీ. ఇక్కడితో వూరుకునేదేం లేదు. పైకోర్టుకి పోదాం. ఈసారి లాయర్ సత్యాబెనర్జీకి కేసుని ఇద్దాం. ఈ తప్పుడు కేసు పెట్టిన వాళ్ళని, అందుకు కారణమైన వారిని ఏ వాక్కర్నీ వొదిలేది లేదు. స్త్రీపురుషుల మధ్య శారీరక సంబంధం వుండటం నేరం ఎలా అవుతుంది? జరిమానా కట్టనని నువ్వు తీసుకున్న నిర్ణయానికి కంగ్రాట్స్" రేవతి చేతిని ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకుంటూ అంది ప్రియా.

"థాంక్‌యూ" అంటూ రేవతి తన వేపే చూస్తున్న రచయితలకి, విమెన్ ఆర్గనైజేషన్స్ వాళ్ళకి, మానవహక్కుల ప్రతినిధులకి, యువతీ యువకులకి చెయ్యివూపింది నవ్వుతూ.

